కెకె లైన్‌లో విరిగిపడ్డ బండరాయి

ప్రజాశక్తి- అనంతగిరి:కొత్తవలస -కిరుండల్ కేకే లైన్ మార్గమధ్యలో సోమవారం రాత్రి ఏడున్నర సమయంలో బండరాయి విరిగిపడింది బండరాయి చిమిడిపల్లి -బొర్రా సమీపం 66/ 12- 13 మైలురాయి సమీపం బ్రిడ్జి వద్ద భారీ బండరాయి విరిగిపడింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎత్తైన కొండ ఎగువ భాగంలో ఉన్న బండ రాళ్లు తరచూ విరిగి పడుతున్నాయి. ఆ సమయంలో విధుల్లో ఉన్న గ్యాంగ్ మ్యాన్ గుర్తించి బొర్రా.చిమిడిపల్లి రైల్వే స్టేషన్‌లకు సమాచారం అందించడంతో రైలును నిలిపి వేశారు. సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలంలో చేరుకొని విరిగిపడ్డ బండరాయిని యుద్ధ ప్రతిపాదికల తొలగించి రైలు రాకపోకల యధావిధిగా కొనసాగించారు.

పట్టాలపై పడిన బండరాయి

25 నుండి కొత్త రేషన్ కార్డులు

-పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి పాడేరు:- ఈనెల 25వ తేదీ నుండి కొత్త రేషన్ కార్డులు అందుబాటులోకి రానున్నాయని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌర సరఫరాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వయో వృద్దులకు ఇంటికే నిత్యావసర సరుకులు అందిసచడం జరుగుతుందన్నారు. ఎఫ్‌పి షాప్‌ల ద్వారా పంపిణి చేయడంతో 1వ తేదీ నుండి 15వ తేదీలోగా వెళ్లి తెచ్చుకోవచ్చని, సంతృప్తికరంగా మార్పును హర్షిస్తున్నారన్నారు. ఈనెల 25వ తేదీ నుండి (స్మార్ట్) కొత్త రేషన్ కార్డులు రాష్ట్ర వ్యాప్తంగా 1,46,00000 అందజేయడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ నుంచి అనేక సంస్కరణలు, కొత్త విధానం ప్రజలకు మరింత మేలైన సేవలు అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. భారతదేశంలోనే 96.4 శాతం ఈకెవైసి పూర్తి చేసుకుని ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. దీపం పథకం గ్యాస్ డెలివరీ విషయం లో ఎటువంటి అవకతవకలు జరగకూడదన్నారు. ప్రతి లబ్ధిదారుణికి మూడు సైలిండర్లు డెలివరీ జరగాల్సిందే అన్నారు. గిరిజన సంపదను 29 వేల ఎఫ్ పి షాపుల్లో అందుబాటులోకి తేవడం జరుగుతుందన్నారు. రాబోయే రోజులలలో మరింత మెరుగైన సేవలు నాణ్యమైన సరుకులు ఇవ్వడానికి చెర్యలు చేపడతామన్నారు. మేలు రకమైన బియ్యం అందజేయడం జరుగుతుందన్నారు. సంతల వద్దకు వెళ్లిన ఆయన దీపం పథకం, నిత్యావసర సరుకులు ఎలా అందుతున్నాయి అన్న అంశాలపై ఆరా తీశారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత చాలా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

ముందుగా జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ జిల్లాలో మండలాల వారీగా చౌక ధర దుకాణాలు, ఆన్లైన్, డోర్ టు డోర్ ద్వారా నిత్యావసర సరుకుల పంపిణి వివరాలు వివరించారు. ఈకెవైసి స్టేటస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పౌర సరఫరాల కమిషనర్ సౌరబ్ గౌర్ మాట్లాడుతూ ఎల్ పిజికి కూడా ఈకెవైసి తప్పక చేయించాలన్నారు. జిల్లాలో నేటికీ 25 శాతం మాత్రమే ఈకెవైసి జరిగిందని, ఈ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జి.సి.సి మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారీ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, సహాయ కలెక్టర్ సాహిత్, వర్చ్యువల్ ద్వారా రంపచోడవరం, చింతూరు ప్రాజెక్ట్ అధికారులు కట్టా సింహాచలం, అపూర్వ భారత్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్ప శ్రీ, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి ఝాన్సీ రామ్, జిల్లా విద్య శాఖాధికారి పి. బ్రహ్మాజీ పాల్గొన్నారు.

అరకులోయ:రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు.అల్లూరి ఏజెన్సీ పర్యటన లో భాగంగా సోమవారం సాయంత్రం అరకులోయ పర్యటించిన ఆయన అరకులోయలో కాసేపు విలేకరులతో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో మహిళలు తమ సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన అన్నారు.

గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా,అనుకూల సమయంలో రేషన్ డిపోలో 15 రోజులపాటు అందుబాటులో వినియోగదారులకు ఉంటుందని ఎప్పుడైనా వెళ్లి తీసుకువచ్చని ఆయన అన్నారు. గ్యాస్ సిలిండర్లు డోర్ డెలివరీ చేసినప్పుడు ఎవరైనా అధికంగా ధర తీసుకున్నట్లయితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంత సమస్యలను ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్, అరకు ఇంచార్జ్ దొన్నుదొరను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంచార్జ్, ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొర, మార్కెట్ కమిటీ చైర్మన్ బీబీ లక్ష్మి, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేలి దాసు బాబు, నిర్మల, జనసేన నాయకులు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మంత్రికి వినతులు

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పర్యటనకు సోమవారం విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు టీడీపీ డివిజన్ నాయకుడు, దారెల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి తో పాటు పలువురు నాయకులు గిరిజన ప్రాంతంలో డి ఆర్ డిపోల స మ స్య ల ను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. గిరిజన ప్రాంతంలో అనేక చోట్ల డి ఆర్ డిపోలు శిదిలావస్థకు చేరుకున్నాయని, కొన్ని చోట్ల అద్దె భవనాలలో నడుతుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి గడుతుల మురళి, గోమాంగి పంచాయతీ అధ్యక్షులు జంపారంగి ధనుంజయ, టీడీపీ నాయకుడు జంపారంగి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు

పాడేరులో వినతిపత్రాన్ని ఇస్తున్న నేతలు

పాడేరు టౌన్: అల్లూరి జిల్లా పెదబయలు మండలంలోని గోమంగి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మండల సాధన కమిటీ ప్రతినిధులు సోమవారం పాడేరు పర్యటనకు విచ్చేసిన మంత్రి నాదెండ్ల మనోహర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. గోమంగికి దగ్గరగా ఉన్న 17 పంచాయతీలను కలిపి గోమంగి మండలం ఏర్పాటు చేస్తే పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని మంత్రికి వివరించారు. మంత్రిని కలసిన వారిలో మండల ఏర్పాటు సాధన కమిటీ ప్రతినిధులు సల్లంగి ఉమామహేశ్వరరావు, కొండలరావు, పాండురంగ స్వామి, కూడ బొంజుబాబు, తిరుపతిరావు ఉన్నారు.

సీలేరు: జికె వీధి మండలం ఆర్‌వినగర్ నుంచి పాలగెడ్డ వరకూ అంతర్రాష్ట్ర రహదారి నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశామని జనసేన జికె వీధి మండల క్లస్టర్ ఇంచార్జి జె.బాలకృష్ణ తెలిపారు. పాడేరులో సివిల్ సప్లయ్ అధికారులతో పాడేరులో మంత్రి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగాకలసి వినతిపత్రం అందించామన్నారు. మంత్రి నాదెండ్ల సానుకూలంగా స్పందించి రహదారి పరిస్థితిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జనసేన జిల్లా మండల నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

కోయతోర్ పండూం దక్కట్‌ను జయప్రదం చేయండి

- పలు చోట్ల ఆదివాసీ జెండాలు ఆవిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలని పిలుపు

చింతూరు: జెండా ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘ నాయకుడు వేకా రాజ్‌కుమార్

ప్రజాశక్తి - వి.ఆర్‌పురం : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా కోయతోర్ పండూం దక్కట్ కూనవరం' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని, ఆదివాసీ గిరిజన సంఘ నాయకులు జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, నాయకులు కారంసుందరయ్య పులిబొజ్జీలు పిలుపునిచ్చారు. సోమవారం సోములుగూడెంలో మండల కమిటీ ఆధ్వర్యంలో జెండాను మాజీ సర్పంచ్ ఆసు లక్ష్మయ్య ఆవిష్కరించారు. కోయతోర్ పండూం దక్కట్ - కూనవరం కార్యక్రమానికి తరలి రావాలని కోరారు. మండల నాయకులు కారం సుందరయ్య, ఊయక దుర్గారావు గ్రామస్తులు పాల్గొన్నారు. ఆదివాసీ నాయకపోడు సేవా సంఘం మండల నాయకులు జీడిగుప్ప సర్పంచ్ మూట్ల బాలరాజు అధ్యక్షతన ములకపల్లిలో శ్రీరామగిరి పంచాయతీ శ్రీరామగిరిలో ఆత్మకూరి కాంతారావు ఆధ్వర్యంలో ఆదివాసీ నాయకపోడు సేవాసంఘం సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడు జిల్లా అధ్యక్షులు చిక్కాల బాలకృష్ణ, మండల నాయకులు వెటకాని మల్లయ్య మాట్లాడుతూ ఆగస్టు 9వ తేదీన ఆదివాసీ దినోత్సవం సందర్భంగా రేఖపల్లిలో సమావేశం నిర్వహిస్తామని అంతా హాజరుకావాలని కోరారు. నాయకపోడు సంఘం నాయకులు వెటకాని మల్లయ్య పాల్గొన్నారు.

చింతూరు : ఏజెన్సీలో స్థానిక సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు వెకా రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. తుమ్మల, బురకనకోట, గూడూరు గ్రామాల్లో ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆదివాసీ దినోత్సవాన్ని జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు వేకా రాజ్‌కుమార్, మడకం రమేష్, ముర్రం పిడగయ్య మాట్లాడుతూ కనీస అవసరాలు తీరక అవస్థలు పడుతున్నారని ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని 100 శాతం రిజర్వేషన్ చట్టంపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. కోయతోర్ పండూం దక్కట్ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు.

మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు బాలకృష్ణ

సీలేరు: ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలని అఖిలపక్ష నాయకులు పోతురాజు గోవింద శోభ జగన్ సత్యమూర్తి పిలుపునిచ్చారు. జికె వీధి మండలం దారకొండ పంచాయతీ హనుమాన్ జంక్షన్ వద్ద దారకొండ గుమ్మిరేవులు దుప్పిలివాడ పంచాయతీ ప్రజలు సమావేశమై పలు విషయాలపై చర్చించారు.

సీలేరు: సమావేశమైన అఖిలపక్షనాయకులు, ప్రజలు

మాట్లాడుతున్న డిపిఎం రామ్మోహనరావు

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి -అడ్డతీగల: స్థానిక మండల కేంద్రంలో వేటమామిడి పంచాయతీ ఐటిడిఎ పరిధిలోని 7 మండలాల ఆర్‌ఎస్‌కెలో పని చేస్తున్న వాస్, విహెచ్‌ఎస్‌లకు ప్రకృతి వ్యవసాయంపై సోమవారం మొదటిరోజు శిక్షణ కార్యక్రమం అడ్డతీగల మండలం వేటమామిడి రైతు సేవా కేంద్రంలో నిర్వహించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ (డిపిఎం) రామ్మోహనరావు ప్రకతి వ్యవసాయం వల్ల ఉపయోగాలు వివరించారు. ఎపిసిఎన్ఎఫ్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ ప్రకృతి వ్యవసాయం శాస్త్రీయ అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా డిపిఎం, మండల వ్యవసాయాధికారులు, విఎఎస్, విహెచ్ఎస్, ఎన్ఎఫ్ఎలు, ఎంఎంటిఎల్, ఎంటీలు యూనిట్ ఇన్‌చార్జిలు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ఎస్ఐ రమేష్

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- చింతూరు: చింతూరులో ఆటోడ్రైవర్లకు సిఐ గోపాలకృష్ణ, ఎస్సై పి.రమేష్ గంజాయి రవాణా గురించి కౌన్సెలింగ్ ఇచ్చారు. చింతూరు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండలంలోని ఆటోడ్రైవర్లను పిలిపించి గంజాయి రవాణాపై కౌన్సెలింగ్ ఇచ్చారు. గంజాయి రవాణా చేయటం, సేవించడం, వ్యాపారస్తులకు సహకరించడం వంటి విషయాల్లో జోక్యం చేసుకోవద్దని సూచించారు. ప్రతిఒక్కరూ డ్రైవింగ్ సీట్లో ఉన్నప్పుడు యూనిఫామ్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని లేకపోతే వాహనాలను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అప్పలరాజుపేటలో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట గ్రామంలో ఆదివారం రాత్రి రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గ్రామస్తులతో మాట్లాడారు. ఉద్యోగాల పేరుతో మోసాలు ఎలా జరుగుతున్నాయో వివరించి అలాంటి మోసపూరిత ఉద్యోగ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. బాల్యవివాహాల వలన జరిగే అనర్దాల గురించి వివరించారు. పొలాల్లో అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, రహదారి భద్రత, వాహనాలు నడిపే నిబంధనలు హెల్మెట్ వాడకం, మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఉపయోగం ఎలా ఉండాలో, ఎలా రిజిస్టర్ కావాలో అత్యవసర సమయంలో ఎలా ఉపయోగించాలో వివరించారు. ఎన్‌డిపిఎస్ చట్టం ప్రకారం మాదకద్రవ్యాల తయారీ, నిల్వ, రవాణా, వినియోగం వంటి కార్యకలాపాల్లో పాల్గొనడం వల్ల తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇటువంటి నేరాలకు దూరంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం

ప్రజాశక్తి - సీలేరు: జికె వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చంద్రుపల్లి, లైకాన్ పూర్, చింతపల్లి క్యాంప్ జి డి సి క్యాంప్‌తో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో సోమవారం మధ్యాహ్నం భారీవర్షం కురిసింది. దీంతో రైతన్నల్లో ఎనలేని ఉత్సాహం నెలకొంది. ప్రస్తుతము దమ్ములు, వరి ఉడుపులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కురుస్తున్న వర్షాలు ఎంతో దోహదపడతాయని రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి -విఆర్‌పురం: పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని, వడ్డిగూడెం పంచాయతీలోనీ బిసి కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది వంద రోజులు పనులు చేశామని కానీ బిల్లులు చెల్లించటంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని వాపోతున్నారు. దాదాపు ఆరు వారాల నగదు రావాల్సి ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. బొడ్డు లక్ష్మీప్రసన్న, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

బల్లగరువు రోడ్డు పనులకు శంకుస్థాపన

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలానికి మారుమూల పిన్నకోట పంచాయతీ పరిధి బలగరువుతో పాటు 11 గ్రామాల లింక్ రోడ్డు పనులు ఎట్టకేలకు సోమవారం స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనవరి 23న డుంబ్రిగుడ మండలంలో శిలాఫలకాలు శంకుస్తాపన చేసిన విషయం విధితమే. నెలలు గడుస్తున్న రోడ్డు పనులు శంకుస్థాపన కాలేదని వారం క్రితం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో గుర్రాలతో నిరసన యాత్ర చేపట్టారు. ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన జిల్లా కలెక్టర్ ఫారెస్ట్ అనుమతులతోపాటు రోడ్డు పనుల శంకుస్థాపనకు ఆదేశించడంతో సోమవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంజనీరింగ్ ఫియర్ డిఇ రవికుమార్ మాట్లాడుతూ,పిన్నకోట, పెద్దకోట. జీనబాడు పంచాయతీ పరిధి బలగరువు, మద్రెబు, తునిసీబు. దాయర్తి ఎనిమిది గ్రామాలకు 12 కిలోమీటర్లు బీటీ రోడ్డు నిర్మాణానికి పీఎం జన్మన్ పథకం కింద 11 .కోట్ల 63 లక్షలు నిధులు మంజూరు కాగా మూడోసారి జిల్లా కలెక్టర్ ఆదేశాలతో టెండర్ 13. కోట్ల 63 లక్షలతో పనులు చేపట్టేందుకు అనుమతి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ పనులు ఏడాదికి పూర్తి చేస్తామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె. గోవింద్ మాట్లాడుతూ, ఈ మూడు పంచాయతీలలో 11 గ్రాములకు రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ గత ఏడాది నుంచి ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో డోలిలతో ఆందోళన నిర్వహించామన్నారు.నిధులు మంజూరు చేసి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించి ఉన్నప్పటికీ పనులు జరగలేదన్నారు. రోడ్డు పనులు మొదలు కావడంతో గిరిజనులు దింసా నృత్యాలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గణేష్, ఎంపిటిసి పియర్ ఏఈ గణేష్ పాల్గొన్నారు.

అరుకు చేరిన జీపుజాతా

ప్రజాశక్తి-అరకు లోయ:ఆదివాసులకు వంద శాతం రిజర్వేషన్, ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ పై ఈ నెల 9 న ముఖ్య మంత్రి ప్రకటన చేయాలని చేపట్టిన జీపుజాతా అరకువేలి మండలం పద్మాపురం గ్రామానికి చేరింది. జీపు జాత రథసారథులు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, సత్యనారాయణ, సాగిన ధర్మన్నపడాల్ భాను, నాయుడు మాట్లాడుతూ, వంద శాతం రిజర్వేషన్ హామీ అమలు చేయాలనానన్రు. ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ ఈనెల 9న ప్రకటించాలని, గిరిజనులకు 100శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో పద్మాపురం సూపర్ ఎంపీటీసీ రాజకుమార్, ఉప సర్పంచ్ భగత్ రామ్, గ్రామ పెద్దలు సన్యాసీ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకు ఐసుబాబు రామారావు, ,రాము ,కొండ , శ్రీను, ఈశ్వర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాలదేవ్

నేడు జిఎంఆర్ పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు జిఎంఆర్ పాలిటెక్నిక్‌లో వివిధ కోర్సులకు సంబంధించిన ఖాళీగా ఉన్న సీట్లకు ఈనెల 5న మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులని వెల్లడించారు. ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. స్పాట్ అడ్మిషన్లకు సంబంధించి ఎటువంటి ఫీజు రీయింబర్స్ మెంట్ సదుపాయం ఉండదని తెలిపారు. విద్యార్థులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి : సిపిఎం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:స్మార్ట్ మీటర్లను వ్యతికరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్బి పోతరాజు చెప్పారు. డుంబ్రిగూడ మండల కమిటీ సమావేశం మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరెంటు స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని, ట్రూ అప్ ఛార్జీలు రద్దు చేయాలన్నారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. ప్రతిపక్ష హెూదాలో ఉన్నప్పుడు ప్రస్తుత విధ్యా శాఖ మంత్రి నారా లోకేష్ స్మాట్ మీటర్లను తీవ్రంగా వ్యతిరేకించారనీ, అధికారంలో వచ్చిన తర్వాత అదానీ కంపెనీకు వత్తాసు పలకడం వెనుక రహస్యం ఏమిటనీ ప్రశ్నించారు. నాడు పగలకొట్టు, నేడు తెచ్చి పెట్టు అన్నట్టు వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. స్మాట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలనీ పిలుపు నిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. ఒప్పందాన్ని రద్దు చేసేవరకు ప్రజలందరూ వ్యతిరేకించాలనీ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డుంబ్రిగూడ మండల నాయకులు పాంగి. సురేష్ కుమార్, తామర్ల సూర్యనారాయణ, పాంగి. సత్యనారాయణ, గెమ్మిలి. మహేష్,కోటి, ఎస్. గుర్మిసింగ్, దేవగున్ పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలి

-జెడ్‌పి సిఇఒ వానపల్లి లక్ష్మణరావు

ప్రజాశక్తి- రంపచోడవరం: ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని తూర్పుగోదావరి జిల్లా ముఖ్య కార్యనిర్వహణ అధికారి వానపల్లి వివిఎస్ లక్ష్మణరావు అన్నారు. సోమవారం రంపచోడవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న బంగారు కుటుంబాలు (పి4) సమగ్ర సర్వే, ఆధార్ లేని పిల్లల నమోదు, స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర, త్రాగునీరు, పారిశుధ్యం, ప్లాస్టిక్ నిర్మూలన, గృహనిర్మాణం ప్రగతి, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు, గ్రామసచివాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై సిబ్బందితో సమీక్షించి గడువులోపు లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ప్రజలకు త్రాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని, పాడైపోయిన చేతి పంపులు, బోర్లు బాగు చేయించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి మూడవ శనివారం ప్రభుత్వ ఆదేశాలు మేరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మలేరియా, డెంగీ నివారణకు సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ కట్టడాలు, అనుమతులు లేని టూరిస్ట్ రిసార్ట్స్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ మండల ప్రగతిని జడ్పీ సిఇఒకి వివరించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు జెడ్‌పి సిఇఒ లక్ష్మణరావుని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిపి బాదాం శ్రీదేవి, జెడ్‌పిటిసి పండా వెంకటలక్ష్మి, గంగవరం జెడ్‌పిటిసి గొల్లపూడి బేబీరత్నం, డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి కోటేశ్వరరావు, పరిపాలన అధికారి జయంతి, డిప్యూటీ ఎంపిడిఒ రాజు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్పి సిఇఒ వానపల్లి లక్ష్మణరావు

మూడు దశల్లో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మూడు దశల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. సోమవారం జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జారీ చేసిన ఉత్తర్వుల కాపీని అధికారులకు చదివి వినిపించారు. మొదటిదశ ఆగస్టు 2 నుంచి 8, రెండోది 9 నుంచి 12 వరకు, 13 నుంచి 15 వరకు మూడో దశ ఉంటుందని వివరించారు. తిరంగతో సెల్ఫీ, ప్రభాత్-ఫెరిస్, తిరంగ ర్యాలీలు (బైక్,సైకిల్ ర్యాలీలు సహా), తిరంగ ప్రదర్శనలు, కార్యక్రమాలు ఉంటాయని స్పష్టం చేశారు. 15న దేశవ్యాప్తంగా ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో తిరంగా ఎగురవేసేదాకా తిరంగా వేడుకలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సెల్ఫీలను www.harghartiranga.com వెబ్‌సైట్ ద్వారా అప్లోడ్ చేయవచ్చని సూచించారు. అధికారులు,ప్రజలు హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జెసి కె.మయూర్ అశోక్, డిఆర్వో భవానీ శంకర్, టూరిజం అధికారి మాధవి పాల్గొన్నారు.

పని చేయని ఫోన్లు మాకొద్దు

ఫోన్లు, సిమ్ కార్డులను సిడిపిఒలకు అందజేసిన అంగన్‌వాడీలు

చింతపల్లిలో ఫోన్లు చూపుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- చింతపల్లి : పనిచేయని ఫోన్లు తిరిగి తీసుకోవాలని, అంగన్వాడీలకు యాప్‌ల గోల తగ్గించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల యూనియన్ పిలుపు మేరకు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పనిచేయని ఫోన్లు వాపసు చేసుకోవాలని అన్నింటిని కట్టగట్టి ఇవ్వగా సిడిపిఒ కార్యాలయ సిబ్బంది నిరాకరించడంతో కార్యాలయం వద్దే బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఫోన్లను కట్టగట్టి ప్రాజెక్టు కార్యాలయంలో ఉంచి, వాటిని తిరిగి ఇచ్చేసినట్లు రుజువుకు ఫోటోలు తీసుకున్నారు. పనిచేయని ఫోన్లు తమకొద్దు అంటూ అంగన్వాడీలు నినాదాలు చేశారు. అనంతరం చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, యాప్‌ల్లో వివరాల నమోదుకు అంగన్వాడీలకు ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేస్తోందన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి. గడుతూరి సత్యనారాయణ, ప్రాజెక్టు కార్యదర్శి రాములమ్మ, పెద్ది. గసాడి లక్ష్మి, సత్యవతి, ఇందు, ప్రసన్న పాల్గొన్నారు.

విఆర్‌పురం: స్మార్ట్‌ఫోన్‌లలో బాలసంజీవని యాప్‌లను జోడించి అంగన్‌వాడీ వర్కర్లపై పనిఒత్తిడిని పెంచుతున్నారని సెక్టార్ కార్ సిఐటియు అధ్యక్షురాలు నాగమణి, సెక్టార్ కార్యదర్శి రాజేశ్వరి ఆరోపించారు. అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు కూనవరం ఒకటి, రెండు ప్రాజెక్టులకు సంబంధించి డిపార్ట్‌మెంట్ ఫోన్లను సిడిపిఒకు సోమవారం తిరిగి ఇచ్చివేసినట్లు వారు తెలిపారు. డిపార్ట్మెంట్ ఫోన్లలో ఈ ఫోటో టెక్స్ బాలసంజీవని యాప్స్ జోడించారని అయితే సిగ్నల్ లేని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా రాకపోవడంతో వివరాలు పంపేందుకు అవస్థలు పడుతున్నారన్నారు. గర్భిణులు, బాలింతలకు ఇకపైన చేయస్తేనే పోషకాహారం పంపిణీ చేస్తామనడంతో ఇకపైన అవని వారికి పోషకాహారం అందక ఇబ్బందులు పడుతున్నారని చేయడానికి సిగ్నల్ రావడం లేదని ఈ యాప్ రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు సున్నం రంగమ్మ, ముత్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : అంగనవాడి ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు కారం రామలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లను ఐసిడిఎస్ కార్యాలయంలో అప్పగించారు. ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రామలక్ష్మి మాట్లాడుతూ ఎఫ్ఆర్ఎస్ యాప్ ని రద్దుచేసి అన్ని యాప్ లను కలిపి ఒకే యాప్ చేయాలన్నారు. నాణ్యమైన 5జి ఫోన్లు ఇవ్వాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సెల్ ఫోన్‌లను తిరిగి రంపచోడవరం ఐసిడిఎస్ కార్యాలయంలో అప్పగించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శంతిరాజు మద్దతు తెలిపారు. అంగన్వాడీ ప్రాజెక్ట్ నాయకులు సింగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

చింతూరు : అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం పిలుపుమేరకు చింతూరు ప్రాజెక్టులో ఉన్న అంగన్‌వాడి కార్యకర్తలు ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. సిఐటియూ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు. సిగ్నల్స్ లేకపోవడం వల్ల సర్వీస్ పనిచేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామన్నారు. నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘం మండల అధ్యక్షులు కారం నాగేశ్వరరావు, కోశాధికారి కారం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం, విఆర్ పురంలో ఫోన్లు చూపుతున్న అంగన్‌వాడీలు

ఐసిడిఎస్ కార్యాలయం వద్ద చింతూరు ప్రాజెక్టు అంగన్‌వాడిల నిరసన

నేరాలు ఘోరాలు

గంజాయి నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: పరారీలో ఉన్న ముగ్గురు గంజాయి నిందితులను అరెస్టు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. 2021లో నమోదైన గంజాయి కేసులో విజయవాడకు చెందిన చిన్ను, గుమ్మిడి సందీప్, వందు విక్రమ్‌లు పరారీలో ఉన్నారన్నారు. ఈ మేరకు వారిని విజయవాడలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. దీంతో ఈ నెల 18వరకు కోర్టు రిమాండ్ విధించినట్లు చెప్పారు.

విరిగిపడ్డ అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు

విరిగిపడ్డ అంగన్‌వాడీ భవనం పైకప్పు రేకులు

- తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -అనంతగిరి: తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అంగన్వాడి రేకుల షెడ్డు పైకప్పు రేకులు విరిగిపడ్డాయి. మండలంలోని మారుమూల పిన్నకోట పంచాయతీ పరిధి కొరపర్తి గ్రామంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎన్నో ఏళ్ళ క్రితం ఈ రేకుల షెడ్డును గ్రామస్తులు కర్రల సహాయంతో ఏర్పాటు చేశారు. అవి పాడైపోవడంతో సోమవారం ఉదయం 8.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఇప్పటికైనా రాష్ట్ర కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయి అంగన్వాడి భవనం ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు బాలింతలు గ్రామస్తులు కోరుతున్నారు.

5న స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల డిప్లమా కోర్సుల్లో మిగులు సీట్లకు కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (సిపిపి), సివిల్ ఇంజినీరింగ్ విభాగాల్లో తక్షణ ప్రవేశాలకు ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్.మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష రాయక పోయినా, టెన్త్ కంపార్ట్మెంట్ ద్వారా పాసైన విద్యార్థినులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. స్పాట్ అడ్మిషన్లు ద్వారా సీటు పొంద గోరు విద్యార్థినులకు ఎటువంటి ఉపకార వేతనం, ఫీజు రాయితీ వర్తించవని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు (పాలి సెట్ 2025 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, పరీక్షకు హాజరైనచో), టిసి, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు ఒరిజినల్, జెరాక్స్ కాపీలు, రెండు పాస్ ఫొటోలు, రూ 5,800 ఫీజుతో ఈ నెల 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు కళాశాలకు హాజరు కావాలని సూచించారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి -తగరపువలస : ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎన్నో ఉద్యోగావకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని విజయనగరం జెఎన్‌టియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ హెచ్ఒడి డాక్టర్ సిహెచ్.బిందుమాధురి విద్యార్థులకు సూచించారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రథమ ఏడాది విద్యార్థులకు సోమవారం ఇండక్షన్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ బిందు మాధురి హాజరై మాట్లాడుతూ, ఎంచుకున్న రంగంలో పట్టు సాధించాలని, ప్రతి అంశంలోనూ నైపుణ్యం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆలోచనలు నూతనంగా, అద్భుతంగా ఉండాలన్నారు. టైమ్ మేనేజ్‌మెంట్, కెరీర్ ప్లానింగ్, ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రాధాన్యతను వివరించారు. విశాఖ టెక్ లీడ్ ఎక్స్‌పర్ట్ ఇన్ ఎఐ, డ్రివెన్ డెవలప్‌మెంట్ ప్రతినిధి సింగంపల్లి వాసు మాట్లాడుతూ, ఉద్యోగం సాధించాలంటే కమ్యూనికేషన్, టెక్నికల్ స్కిల్స్, పైథాన్, జావా, మిషన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ కోర్సులపై అవగాహన ఉండాలన్నారు.

ఆర్‌టిసి బస్సు పునరుద్ధరణ

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండలంలోనీ మారుమూల ప్రాంతమైన డుడుమ ప్రాంతంలో ఆర్టీసీ సర్వీసు నిలుపుదలపై పలు పత్రికల్లో కథనాల కు స్పందించిన పాడేరు ఆర్టీసీ మేనేజర్ పునరుద్ధరణ చేశారని మండల గిరిజన సంఘం ఎంఎం శ్రీను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 10 రోజుల తర్వాత మండల కేంద్రంలో డుడుమ బస్సు రాకతో ప్రజలకు ప్రయాణ కష్టాలు తీరుతుందన్నారు. ఇటీవల కాలంలో ఈ బస్సు లేక తీవ్ర అవస్థలు పడ్డారు. భవిష్యత్తులో బస్సు నిలుపుదల చేయకుండా కొనసాగించాలని కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

పునరుద్ధరించిన బస్సు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని చీకు మద్దుల పంచాయితీ పరిధిలో గుమ్మడిగుంట గ్రామంలో రూ.15 లక్షల మండల పరిషత్ నిధులతో మట్టి రోడ్డు నిర్మాణ పనులు సోమవారం వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు స్థానికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి సౌకర్యం లేక ప్రజలు రాకపోకలకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పాడేరు మండలం సప్పిపుట్టు నుండి గుమ్మడిగుంట వరకు 2 కిలోమీటర్ల రోడ్డు పూర్తయితే చెక్‌గేట్-వంతాడపల్లి మీదుగా అరగంటలో పాడేరుకు చేరవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీసా ప్రెసిడెంట్ జన్ని అప్పల స్వామి, సెక్రటరీ వలస బోయిని ప్రసాద్‌రావు, వార్డు మెంబర్ జన్ని పవన్, మాజీ వార్డు మెంబర్ వలసనైని మహేష్, జన్ని వెంకట్, కొర్ర మత్స్య రాజు, సంతోష్, బాలకృష్ణ, వెంకట స్వామి, అనిల్ పాల్గొన్నారు.

పనులు ప్రారంభిస్తున్న వైస్ ఎంపిపి

ప్రజల నుండి అర్జీలను స్వీకరిస్తున్న ఐటిడిఎ పిఒ

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 64 అర్జీలు

ప్రజాశక్తి-రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు సంబంధిం చి వ్యక్తిగతానికి సంబంధించి వినతులు స్వీకరించి కొన్ని సమస్యలు వెంటనే పరిష్కరించి మరికొన్ని సమస్యలకు పరిష్కార మార్గాలు అన్వేషించి సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ప్రజాసమస్యలపరిష్కార వేదిక (గ్రీవెన్స్) నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ ఈ వారం 64 అర్జీలు వచ్చాయని తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, గిరిజన పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, అడిషనల్ డాక్టర్ జి.శిరీష, ఏజెన్సీ డిఇఒ మల్లేశ్వరరావు, ఉపాధి ఎపిడి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవికుమార్, సుబ్బయ్య, వెలుగు ఎపిడి డేగలయ్య, పిఎఓ ఎల్.రాంబాబు,సబ్ కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిని యం.సావిత్రి,తాసిల్దార్ బాలాజీ, డిప్యూటీ ఎంపిడిఒ వై.రాజబాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పి.వెంకటరమణ, డిప్యూటీ తహాశీల్దారు త్రిమూర్తులు, సూపరింటెండెంట్ బి.కిషోర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎం.లక్ష్మణ్, మండల వ్యవసాయ శాఖాధికారి లక్ష్మణ్, పిఎంయు అధికారిని చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు.

5న పోలవరం నిర్వాసితుల తాడువాయి సందర్శన

ప్రజాశక్తి - చింతూరు : డివిజన్ నందు నాన్‌ట్రైబ్స్ కోసం అర్ అండ్ అర్ కాలనీల స్థలాల ఎంపిక కోసం చింతూరు ఐటిడిఎ పిఒ తాడువాయి గ్రామంలో ఇంతకు ముందే భూ సేకరణ చేసి అర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణం కోసం సిద్ధంగా ఉన్న భూములను చూపించడానికి వి.ఆర్‌పురం మండలం లోని రాజుపేట, రాజుపేట కాలనీ గ్రామస్తులకు రెండు బస్సులు ఈ నెల ఐదో తేదీన ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. రాజుపేట రాజుపేటకాలనీ గ్రామాల నాన్‌ట్రైబ్స్ అందరూ తాడువాయి గ్రామాన్ని సందర్శించి త్వరగా వారి అభిప్రాయం తెలపాలని తదుపరి ప్రతిపాదనలు కలెక్టర్‌కి పంపడం జరుగుతుందని పిఒ అపూర్వభరత్ ఒక ప్రకటనలో తెలిపారు.

కబడ్డీ కోర్టు తడవకుండా టార్పాన్లు కప్పిన సిబ్బంది

నేటి నుంచి కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో మధ్యాహ్నం భారీ వర్షం కురవడంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. ఎపి జెన్కో ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఇంటర్ సర్కిల్ కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ పోటీలకు ఏర్పాటుచేసిన కోర్టు తడవకుండా టార్పాలు కప్పి తడవకుండా చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం డిఎవి స్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కోర్టు చుట్టుపక్కలా ఫ్లడ్‌లైట్‌లు అమర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు జరగనున్న పోటీలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేశారు.

పామాయిల్‌తో రైతుల ఆర్థికాభివృద్ధి

ప్రజాశక్తి - అడ్డతీగల: పామాయిల్ సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అన్నారు. అడ్డతీగల మండలంలోని కోనలోవ గ్రామంలో బుర్లెహరిబాబు తోటలో సోమవారం నిర్వహించిన పామాయిల్ తోటల విస్తరణ మహోత్సవం కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. కార్యక్రమాన్ని రాష్ట్ర ఉద్యానశాఖ, పతంజలిఫుడ్స్ లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి. గ్రామానికి చెందిన రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ, పామాయిల్ వలన నియోజకవర్గంలోని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని ప్రభుత్వం రైతులకు త్వరితగతిన సబ్సిడీ అందిస్తోందని చెప్పారు. పతంజలి సంస్థ సభ్యులు మాట్లాడుతూ రైతులకు పంట గురించి అవగాహన కల్పించడంలో, తగు సూచనలు చేస్తూ మంచి సదుపాయాలు కల్పిస్తున్నారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఆయిల్ ఫామ్ ఉత్తమరైతు ములగపాటి రామాంజనేయరాజును సన్మానించారు. కార్యక్రమంలో పిహెచ్ఒ దయానంద్, కృషి విజ్ఞాన కేంద్రం హెడ్ సైంటిస్ట్ రాజేంద్రప్రసాద్ పామాయిల్ పంట రైతులకు దేశానికి చాలా ప్రాధాన్యత కలిగిన పంటని ఈ పంట సాగు చేస్తే ఆర్థికంగా లాభం అని తెలిపారు. పతంజలి సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.ఎస్.ప్రకాష్ మాట్లాడుతూ పాడేరు జిల్లాలో పామాయిల్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని తెలియజేశారు. పతంజలి సంస్థ రైతులు సుస్థిరమైన అభివృద్ధి సాధించటంలో తమ వంతు పాత్ర సమర్ధంగా పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఎన్ఎంఇఒ పథకం ద్వారా రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తోందని చెప్పారు. ఈ ప్రాంతానికి పామాయిల్ పంటను తీసుకురావటంలో ఎన్నో సవాళ్ళు ఎదుర్కొన్నామని కానీ ఇప్పుడు ఇక్కడ పామాయిల్ సాగు పెరుగుతున్న విధానం చూస్తూ ఉంటే పాడేరు జిల్లా త్వరలో మొదటి స్థానంలో చేరుతుందని ఆకాంక్షించారు. పతంజలి సంస్థ ఈ ప్రాంత రైతుల సౌకర్యం కోసం ఐదు పామాయిల్ గెలల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసిందని, భవిష్యత్తులో రైతుల అవసరార్థం మరిన్ని ఏర్పాటు చేస్తోందని తెలియజేశారు. ఉద్యానశాఖాధికారి ముత్తయ్య మాట్లాడుతూ, పామాయిల్ సాగులో ఏజెన్సీ మండలాలు అగ్రగామిగా ఉన్నాయని, సుమారుగా 2000 హెక్టార్లలో పామాయిల్ సాగులో ఉందని తెలిపారు. పతంజలి కంపెనీ ద్వారా ఉచితంగా మొక్కలు ఇస్తుందని తద్వారా రైతుకు మొక్కలు రూపేణా హెక్టారుకు రూ. 29 వేలు సబ్సిడీ వస్తుందని నాలుగు సంవత్సరాల వరకూ ఎరువుల నిమిత్తం సబ్సిడీ అంతర్ పంటల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం డ్రిప్ పరికరాలపై రాయితీ ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో అడ్డతీగల మండల వ్యవసాయ అధికారి శివశ్రీనివాస్, బిజెపి రాష్ట్ర జనరల్ సెక్రటరీ స్వప్నకుమారి, అడ్డతీగల పిఎసిఎస్ అధ్యక్షులు హరిబాబు టిడిపి సీనియర్ నాయకులు తాతారావు, పతంజలి సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ చక్రిబాబు, క్లస్టర్ ఇంచార్జ్ రాంబాబు, ఫీల్డ్ సూపర్‌వైజర్స్ కొండలరావు, సతీష్, దుర్గాప్రసాద్, కుమార్ పతంజలి సంస్థ సిబ్బంది, ఉద్యానశాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది హాజరయ్యారు.

ఉత్తమరైతు రామాంజనేయరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

తల్లి పాలతో పిల్లలకు మేధస్సు

తల్లులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి- రంపచోడవరం : పుట్టిన పిల్లలకు తల్లిపాలు అందించాలని ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం ఐటిడిఎ సమావేశ భవనంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, గర్భిణులతో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయనతో పాటు రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వడంతో వివిధ రకాలైన వ్యాధుల నుండి పిల్లలను రక్షించుకోవచ్చన్నారు. సబ్‌కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే శిశువుకు ఇవ్వాలన్నారు. తల్లిపాలు పిల్లల మేధస్సును మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. తల్లిపాలు గురించి ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. అనంతరం గర్భిణులకు చీర, పసుపు, కుంకుమ గాజులు ఇచ్చి సీమంతాలు నిర్వహించారు. ఎంపిపి బంధం శ్రీదేవి, జెడ్‌పిటిసి పండ వెంకటలక్ష్మి, డిఎంహెచ్ఒ డాక్టర్ డేవిడ్, వైద్యాధికారి శిరీష ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు కుసుమ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పాఠశాలలోనికి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా, ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటిని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) విశాఖ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తూ సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఉత్తర్వుల కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జెనాయుడు మాట్లాడుతూ పాఠశాల విద్యా కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వుల మూలంగా విద్యార్థులు తమ స్వేచ్ఛను కోల్పోతారన్నారు. ఈ వైఖరి సరైనది కాదన్నారు. విద్యాశాఖకు మంత్రిగా ఉన్న నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సంప్రదింపులు జరిపేవారని వారి పాత్రను గుర్తు చేసారు. ఎటువంటి రాజకీయాలకు తావివ్వొద్దని చెప్తున్న విద్యాశాఖ పిటిఎం పేరుతో చేసేదేమిటని ప్రశ్నించారు. ఈ ఉత్తర్వులు ద్వారా ప్రైవేటువారి వ్యాపారం, అన్యాయాలను బయటకు తీసే అవకాశం ఉండదని వారి దోపిడీ పెంచుకునేందుకు దోహదపడతాయన్నారు. ఇది ప్రజాస్వామ్య స్వేచ్ఛను హరించే విధంగా ఉన్నందున, రాష్ట్రవ్యాప్తంగా ఉత్తర్వుల కాపీ దగ్ధం చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.అజయ్, ఉపాధ్యక్షులు కౌశిక్, నరేష్, మౌనిక, కుసుమాంజలి, నాయకులు ప్రగతి,ఎం.కావ్య, సూర్య, సంజయ్, భరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ప్రజాశక్తి- రంపచోడవరం : ఏజెన్సీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చిన రోగులకు వెంటనే మెరుగైన వైద్యసేవలందించాలని పిఒ కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటిడిఎ సమావేశ భవనంలో అడిషనల్ డిఎంహెచ్ఒ, జిల్లా మలేరియా అధికారితో, అన్ని పిహెచ్‌సిల వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చిన వారి రక్తనమూనాలు స్వీకరించి ఆయావ్యాధులకు ఉచిత మందులు అందజేయాలన్నారు. గర్భిణులకు రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలన్నారు. సమావేశంలో ఎడియంహెచ్ఓ డేవిడ్, డాక్టర్ జి.శిరీష, డి ఎంఒ జ్ఞాన శ్రీ, శ్రీనివాసరాజు వైద్యాధికారులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న సర్పంచ్ వెంకన్నబాబు, ఎంపిటిసి నాగరాణి

ఆర్ఒ ప్లాంట్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని కరకగూడెం పంచాయితీలో చాలా మంది కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని జెడ్‌పిటిసి గుజ్జా విజయ, ఎంపిపి పాయం రంగమ్మ అన్నారు. ఈ నేపథ్యంలో జెడ్‌పిటిసి గుజ్జా విజయ, ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కు పలుమార్లు విన్నవించారు. ఆయన స్పందించి కరకగూడెం, బోదునూరు గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్‌కి నిధులు విడుదల చేసినట్టు ఆమె తెలిపారు. కరకగూడెం సర్పంచ్ నూప వెంకన్నబాబు, ఎంపిటిసి మడకం పూర్ణ నాగరాణి ఆధ్వర్యంలో సోమవారం భూమిపూజ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ బోదునూరు, పాలగూడెం, మెట్ట రామవరం గ్రామాల్లో ఆర్ఒ ప్లాంట్ అందించిన పిఒ అపూర్వభరత్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు భరపాటి ప్రకాష్, జనసేన మండల అధ్యక్షులు నరేంద్ర, బిజెపి రాష్ట్ర మోర్చా నాయకులు నోముల రామారావు, ప్రేమ్‌చంద్ స్థలం దాత కారం సాగర్ పాల్గొన్నారు.

వంతెనపై గుంత పూడ్చరూ..!

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం దారకొండ పంచాయతీ సాకిరేవు గెడ్డ బ్రిడ్జి అప్రోచ్ మధ్యలో గండి పడింది. ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఆర్టీసీ బస్సులు ఇతర వాహనాలు తిరుగుతుంటాయి. ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు నుంచి సిమెంట్‌రేకులు, లోడ్ లారీలు ఎక్కువగా వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. అప్రోచ్ గండి పడటం వలన ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాహన చోదకులు, పాదాచారులు ఆందోళన చెందుతున్నారు. గండి పడిన ప్రదేశంలో కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడానికి ఆర్అండ్‌బి అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు గండి తక్షణమే పూడ్చి వేయడానికి చర్యలు చేపట్టాలని దారకొండ పంచాయతీ పరిధి ప్రజలు కోరుతున్నారు.

గెడ్డ వద్ద వంతెనపై పడిన గొయ్యి